ఉత్తేజాన్ని ఇచ్చే ఉదయపు ఎండ...

నిప్పులు చెరిగే మాధ్యాహ్నపు ఎండ...

అవన్నీ అనుభవంలోకి వొచ్చాయి.

సాయంకాలపు నీరెండలోకి చేరుకుంది జీవితం.

ముందున్నది చీకటని తెలుసు. వెలుగును ఎంతగా ప్రేమించానో చీకటిని కూడా అంతే అభిమానంగా ఆహ్వానించడానికి సిద్ధంగా వున్నాను.

# సొంత ఇల్లు

–అలపర్తి రామకృష్ణ

నా కోరిక పాతికేళ్ళ సర్వీసులో తీరలేదు. అద్దె ఇళ్ళలో కాలక్షేపం చేయడమేగాని సొంత ఇల్లు ఏర్పడలేదు.

రిటైరయ్యాక లక్షరూపాయల దాకా డబ్బొచ్చి చేతిలో పడింది. కొడుకులిద్దరూ ఉద్యోగస్థులే! వాళ్ళెవరూ ఆ డబ్బు కావాలని అడగరు.

స్వగ్రామంలో ఓ ఇల్లు కొనుక్కుని శేషజీవితం ప్రశాంతంగా గడపాలి...

ఆ మాటే మా పెద్దబ్బాయితో అంటే పెద్దగా నవ్వాడు వాడు.

"అప్పుడే శేష జీవితం ఏమిటి నాన్నా! మీకు ఇంకా అరవైయ్యేళ్ళు కూడా రాలేదు.. తొంభైయ్యేళ్ళు దాటితే అప్పుడే శేషజీవితం మొదలయ్యేది. అన్ని రంగాల్లో అరవైయ్యేళ్ళు దాటిన వాళ్ళు చురుగ్గా పని చెయ్యడం లేదు! అయినా స్వగ్రామం అంటారే గాని మీకు అక్కడ తెలిసిన వాళ్ళు ఎవ్వరున్నారు.... మమ్మల్ని వదలి పల్లెటూరులో వుండగలరా—

పెద్దబ్బాయి మాటల్లో నిజం లేకపోలేదు.

"అక్కడకు వెళ్ళి నేను ఖాళీగా కూర్చోను.. ఏ కోళ్ళఫారమో, పది గేదెలో పెట్టుకుని వ్యవసాయం చూసుకుంటూ కాలక్షేపం చేస్తాను. ముందు మనవూరు వెళ్ళి ఏదొక ఇల్లు కొనెయ్యాలి".

నా ఆలోచన వాడికి బాగానే వున్నట్లుంది. సరేనన్నట్లు తలూపాడు.

స్వగ్రామంలో పట్టుమని పది రోజులు కూడా వుండలేదు ఎప్పుడూ. మూడెకరాల మాగాణి వుంది తప్పితే సొంత ఇల్లు లేదు. సొంత వూరు వొదిలిపెట్టి ఎప్పుడో వచ్చేసాం . చదివింది, ఉద్యోగాలు చేసింది పట్టణాల్లోనే.

మా ఆవిడక్కూడ పట్టణంలో వుండాలన్న పట్టుదల లేదు.

ఏ పని చేయక పోయినా పెన్షన్ డబ్బులతో కాలక్షేపం చేయొచ్చు....

కొడుకులిద్దరూ నా మీద ఆధారపడవల్సిన అవసరం లేదు... పెద్దాడు బ్యాంక్ క్లర్కు వాడికి పెళ్ళయ్యింది. రెండో వాడు రైల్వే స్టేషన్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. వాడి పెళ్ళి సమస్యేకాదు... నచ్చినమ్మాయిని వాడే చేసుకుంటాడు...

స్వగ్రామం చేరుకున్నాను.

ఎత్తయిన మట్టిదిబ్బ మీద వుందా పెంకుటిల్లు. ఇంటి చుట్టూ కొబ్బరి చెట్లు ఇంటిముందు రకరకాల గులాబీ మొక్కలు. ఓ పక్క సన్నజాజి పందిరి.. మరోవైపు మల్లెపందిరి.

ఇంటిముందు పెద్దరాతి అరుగులు. అరుగులమీద కూర్చుంటే ఎదురుగా మిల, మిలా మెరిసే నీళ్ళతో పెద్ద చెరువు కన్పిస్తుంది. చేపపిల్లకోసం నీళ్ళమీద గంతులేసే కొంగలు, కంటికి ఇంపుగా కన్పించే తామరపూలు, ఆ ఇంటి అరుగుమీద కూర్చుంటే ఆకలి దప్పులుండవనిపిస్తుంది.

నిజంగా ఆ ఇల్లు అమ్మకానికి దొరకడం నా అదృష్టమే.

నాకు అదృష్టమైనపుడు మరొకరికి దురదృష్టం కావాలికదా! ఆ దురదృష్టవంతుడు చలమయ్య.


చలమయ్యకి యాభైయ్యేళ్ళుంటాయి. మనిషి పొట్టిగా, లావుగా వుంటాడు. మనిషిని చూస్తే ఏ సమస్యలు లేనివాడిలా కన్పిస్తాడు. అతని గుప్పెడు గుండె నిండా గునపంతో గుచ్చుకునే సమస్యలు...

అతను కూతురు పెళ్ళికోసం ఇళ్ళు అమ్ముకోవాల్సి వచ్చిందని వూళ్ళోవాళ్ళు చెబితే వినడమే గాని అతనెప్పుడూ చెప్పుకోలేదు.

ఇల్లు అమ్మేసేక కూడా రోజూ వచ్చేవాడు. ఉదయం, సాయంత్రం అరుగుమీద గంటల తరబడి కూర్చునేవాడు. గోడలు చేతితో తాకుతూ ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేసేవాడు. మధ్యాహ్నం పూట ఇంటి వెనుక వున్న మామిడి చెట్ల నీడలో కండువా నేలమీద పర్చుకుని నిద్రపోయేవాడు.

వూరిబయట పోరంబోకు స్థలంలో పూరిపాక వేసుకున్నాడు చలమయ్య. అక్కడ వుండక పగలంతా నా ఇంటి ముందు పడిగాపులు గాయడం నాకంత నచ్చేది కాదు.

ఒక్కోసారి భోజనం సంగతి కూడ మర్చిపోయి రాత్రితొమ్మిదయ్యేవరకు అరుగు మీదే పడుకునేవాడు. కూతురు వచ్చి తండ్రిని నిద్రలేపి తీసుకుపో



యేది.

"పెళ్ళికుదిరిన ఆడపిల్లను రాత్రిపూట ఇబ్బంది పెట్టక పోతే, చీకటి పడకముందే ఇంటికి పోకూడదు!" అనేవాడివి మాలతితో

ఈ యిల్లు కొనుక్కున్న నెలరోజులకే ఇంటిమీద మమకారం మీకు ఏర్పడింది... ఇదే ఇంట్లో పాతిక సంవత్సరాలు కాపురం చేసిన చలమయ్యగారికి ఎంత మక్కువ వుండాలి? మీ అరుగుల మీద ఆయన పడుకుంటే అరుగులేం అరిగిపోవులెండి!" అంది మా ఆవిడ నవ్వుతూ.

ఆ మాటల్లో నిజం వున్నా వూళ్ళోజనం 'చలమయ్యగారి ఇల్లు చూడముచ్చటగా వుంటుందనడం' నచ్చలేదు. పైగా ఆయన పగలంతా ఇంటి ముందు తిష్ట వేయడం అసలు నచ్చలేదు. ఇల్లు కొనక ముందు చలమయ్యను మెచ్చుకున్న మనస్సు ఆ ఇంటి రూపశిల్పి ఇంటి ముందు తచ్చాడడమే నచ్చక ఉగ్రరూపం దాల్చుతూవుంది.

చలమయ్య మొహం వాచేటట్లు చివాట్లు పెట్టాలని నిర్ణయించుకున్నాను. మాలతికి చెబితే 'అటువంటి' పిచ్చి పనులు చెయ్యకండని మొత్తగా మందలించింది.

చలమయ్య కూతురు రజని తరుచుగా ఇంటికి రావడం మా ఆవిడతో కలుపుగోలుగా మాట్లాడటం, ముగ్గులేసి పెట్టడం, పచ్చళ్ళు పట్టడంలో మా ఆవిడకు సహాయ పడటం, ఇంట్లో ఏం వండుకున్నా తెచ్చి మాలతికి కూడా రుచిచూపించడం— ఆ అమ్మాయి వో రోజు కనబడకపోతే వూరిబయట వున్న వాళ్ళింటికి మాలతి వెళ్ళేవరకు వాళ్ళిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అందుకనే వాళ్ళమీద ఈగ వాలనివ్వదు మాలతి.

చెరువుకట్టమీద మర్రిచెట్టు నీడలో కూర్చుని జనపనారతో తాడు పేనుతున్న చలమయ్య కన్పించాడు. ఆయన వొంటరిగా దొరకడం నా అదృష్టంగా భావించాను. మెల్లగా కబుర్లలో దించి 'ఎప్పుడూ మా ఇంటి అరుగులమీద పడుకోవడం' అంత మంచి పద్ధతి కాదని మందలించాలనుకున్నాను.

"ఏం చేస్తున్నారూ?"

పాడిగేదెకు తాడు పేనుతున్నానని ఆయన సమాధానమిస్తాడని తెలిసికూడా చలమయ్య పక్కనే కూర్చుంటూ అడిగేను.

నవ్వి వూరుకున్నాడు వో క్షణం.

"మీతో ఓ ముఖ్యవిషయం మాట్లాడదామనుకుంటున్నానండీ" అన్నాడు చలమయ్య చూపులు పేనుతున్న తాడుమీదే నిల్పి.

ఏమిటన్నట్లు ఆయనవైపు చూశాను.

"మీ డబ్బు తిరిగి ఇచ్చేస్తాను... నా ఇల్లు నాకిచ్చెయ్యండి" అన్నాడు చలమయ్య.

ఆ ఇంటివైపే రావద్దని చెబుదామని నేననుకుంటుంటే ఇల్లు ఇచ్చెయ్యమ ంటాడేమిటి?

నోళ్ళమండింది.

"మీ అమ్మాయి పెళ్ళి చేయాలని కదా మీరు ఇల్లు అమ్ముకుంది" అన్నాను తమాయించుకుని.

"రెండు మూడు సంబంధాలు చూశానుగాని, ఏదీ కుదరలేదు... కట్న కానుకల దగ్గర పేచీలు పెట్టుకుని తప్పుకు పోతున్నారు. ఇంకా రెండు మూడేళ్ళవరకు పెళ్ళి ప్రసక్తే తీసుకురావద్దని మా రజని గొడవ చేస్తున్నది.. నాక్కూడ ఇల్లు అమ్ముకున్నప్పటి నుండి మనస్సు కుదురుగా వుండటం లేదు. ఏదో బెంగగా వుంటున్నది. నా కొడుకు నేను శ్రమపడి కట్టుకున్నాం ఆ ఇల్లు.. రాత్రిపూట మా అబ్బాయి కల్లోకి వచ్చి ఆ ఇంట్లోనే నన్ను వుండమన్నాడు.. దయచేసి నా ఇల్లు తిరిగి నాకు ఇచ్చేయ్యండి" అన్నాడు ప్రాధేయపడుతూ...

నాలో కోపం కట్టలు తెంచుకుంది.

"పల్లెటూళ్ళో ప్రశాంతంగా వుందామని పట్నం వొదిలి వచ్చాను. ఇక్కడ మాటమీద నిలకడలేని మనుషులుంటారని ఇప్పుడే తెలిసింది. ఇల్లు అమ్ముకునే హక్కేగాని తిరిగి అదే ఇల్లు కొనుక్కునే హక్కు నీకు లేదు.. నువ్వు పెద్ద పెద్ద ప్లీడర్లను పట్టుకున్నా ఆ ఇల్లు తిరిగి నీకు రాదు... అమ్మాయి పెళ్ళి చేసి కృష్ణా రామా అనుకుంటూ ఏదో మూలన పడివుండు" అనేసి అక్కడ నుండి వచ్చేశాను.

ఇంటికి తిరిగొచ్చేసరికి మాలతి మైసూర్‌పాక్,

బూంది ప్లేటులో పెట్టుకుని ఎదురొచ్చింది.

"మీరటు బయటకు వెళ్ళగానే మన చిన్నబ్బాయి వచ్చాడండి. వాడికి మనవూరి రైల్వేస్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ వచ్చిందట. పదేళ్ళ వరకూ మళ్ళీ ట్రాన్స్‌ఫర్ రాదంటున్నాడు. వాడూ మనతో పాటే వుంటాడు మనకు బోలెడంత కాలక్షేపం అంది మాలతి.

ఆ సంతోషంలో మైసూర్‌పాక్ ప్లేటూ నాకివ్వడం మర్చిపోయి మైసూర్‌పాక్ ముక్కలు నోట్లో వేసుకుంటూ నిలబడింది.

ఆమె మొఖంలో కొట్టొచ్చినట్లు కన్పిస్తున్న ప్రశాంతత, ఆనందం నన్ను ముగ్దుడ్ని చేశాయి.

ఆ ఇంట్లోకి వచ్చాక అన్నీ కలిసి వచ్చాయి.

పల్లెటూరు వొచ్చేక మాలతి ఆరోగ్యం కుదుటపడింది. అదివరకెప్పుడూ మందు బిళ్ళలు మింగుతూ వుండేది. చలమయ్య గొడవ తప్పితే తనక్కూడా ఇక్కడే హాయిగా వుంది... చిన్నాడికీ ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ వచ్చింది.. పెద్దాడికి ప్రమోషన్ వచ్చింది.

కొందరికి ఇల్లు కొన్నాక అన్నీ కలిసొస్తాయి.. అలా కలిసి వస్తున్నప్పుడు సొంత ఇల్లు అమ్ముకోకూడదు.

ఆ ఇంట్లో వున్నప్పుడు చలమయ్య ఏం బాగుపడ్డాడు... పొలం అమ్ముకున్నాడు. చేతికి అందివొచ్చిన కొడుకు చెరుకు ఫ్యాక్టరీకి తీసుకెళ్తున్న ఎడ్లబండి కిందపడి చనిపోయాడు.. కూతురికి పెళ్ళికుదరలేదు.. ఇంకా ఎందుకు అదే ఇల్లు కావాలని పాకులాడతాడు.....?

ఆరునూరైనా ఇల్లు మాత్రం చలమయ్యకి తిరిగి ఇచ్చేది లేదు...

చెరువు కట్టమీద చలమయ్యతో జరిగిన సంభాషణ మాలతికి చెప్పలేదు.. చెబితే బాధపడుతుంది.

***

కరివేపాకు పట్టుకొచ్చింది రజని.

"ఎందుకమ్మా! నీకు ఆ శ్రమ.. సాయంత్రం మీ ఇంటివైపు వొద్దామనుకొంటున్నా" అందా అమ్మాయి.

ఈ మధ్య మాలతికి రజని అంటే బాగా మక్కువ ఏర్పడింది. అదో పెద్ద చిక్కొచ్చిపడింది. ' రజనిని కూడా ఈ ఇంటిగడప తొక్కొద్దంటే ఏమనుకుంటుందో?

"మామయ్యగారికి ఇష్టమని ములగకాయలు తెచ్చాను.. పప్పుచారులో వెయ్యి అత్తయ్యా!" అందా అమ్మాయి.

వరసలు కూడా కలిపేసి మాలతిని బుట్టలో వేసుకుంది. మాలతికి ఏ కొద్దిగా వొళ్ళు వెచ్చబడినా, జలుబు చేసినా ఆ అమ్మాయే వంట చేసి వెళ్తుంది. పల్లెటూరి వంటకాల రుచి మా ఇద్దరికి రుచిచూపించి లోబర్చుకుని మళ్ళీ ఇల్లు సొంతం చేసుకోవాలని చూస్తున్నారల్లేవుంది....

...ఆపప్పులేం మనదగ్గర పుడకవ్..

"ఇదిలో అమ్మాయ్... మీరెన్ని ఊసరవెల్లి తంతులేసినా మేం ఈ ఇల్లు తిరిగి ఇచ్చేది లేదు.. మీ నాన్నకు ఈ మాటే తెగేసి చెప్పాను..

ఆ అమ్మాయి బిత్తరపోయింది.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గిర్రున వెనక్కు తిరిగి ఇంట్లోనుంచి వెళ్ళిపోయింది.

"మీకు ఎలా మాట్లాడాలో తెలియదు, ఆ అమ్మాయి మనస్సు నొప్పించేరు..

"... మధ్యలో ఆ పిల్ల ఏం చేసింది? చిన్నపిల్లల మీద విరుచుకు పడటం చేతనవును మీకు"

మాలతికి కూడా ఏడుపొచ్చింది.

కొద్ది క్షణాల్లో నా ప్రవర్తన నాకే అసహ్యమనిపించింది.

***

రజని మాఇంటికేసి రావడం మానేసింది.

చలమయ్యకూడ ఆ ఇంటి ఛాయలకు రావడం లేదు. అరుగులమీద ఆయన కూర్చోకపోవడం నా మనస్సు కుదుటపడింది.

వారం రోజుల తర్వాత తెలిసింది. చలమయ్యకు వొళ్ళుతెలియని జ్వరమని. మాలతి రెండుమూడు సార్లు చలమయ్య ఇంటికి వెళ్ళి చూసొచ్చింది.

ఊళ్ళో అందరికి తెలిసిపోయింది.

చలమయ్యని అరుగులమీద కూర్చోవద్దన్నానని

నన్నో పురుగును చూస్తున్నట్లు చూడడం మొదలుపెట్టారు ఊళ్ళో ఎదురుపడ్డవాళ్ళు.. పలకరించడమే మానేశారు.

అన్నిటికంటే అసంతృప్తి కల్గించిన విషయం అరుగులు బోసిగా కనపడటం. ఆ అరుగులమీద నలుగురైదుగురిని చేర్చుకుని చలమయ్య ఎప్పుడూ పిచ్చాపాటి మాట్లాడుతూ వుండేవాడు. ఇంటిముందు సందడిగా వుండేది. ఎవరూ లేనప్పుడు అరుగులమీద నుంచి కనీసం చలమయ్య గురకన్నా వినపడేది.

దెబ్బమీద దెబ్బ తగిలినట్లుగా మరోపరిణామం నా అంచనాలను తల్లకిందులు చేసింది. చలమయ్య జ్వరం తగ్గాక మళ్ళీ అరుగులమీద చేరేడు.

చిన్నబ్బాయి రవి ఈ మధ్య చలమయ్యగారింటికి రాకపోకలు ఎక్కువ చేయడమే కాక, రజనిని పెళ్ళి చేసుకుంటానని మొండిపట్టుపట్టాడు.

***

రజని మా ఇంటి కోడలయ్యింది.

ఇంట్లో కొడుకు, కోడలు కిలా కిలా నవ్వుకుంటుంటే అరుగుల మీదకు చేరక తప్పలేదు. చలమయ్య పక్కన కూర్చుని పంటల గూర్చో కోడెగిత్తల గూర్చో మాట్లాడక తప్పలేదు.

ఒక సంవత్సరం గడిచేక పక్కన చలమయ్య లేకపోతే ఏమీ తోచని పరిస్థితి ఏర్పడింది.

మేమిద్దరం అరుగుమీద కూర్చుని మాట్లాడుతూ వుంటే పోస్ట్‌మాన్ ఉత్తరం తెచ్చి ఇచ్చాడు.

చేపల చెరువు తవ్వడం కోసం మండలం ఆఫీసులో అర్జీ పెట్టా, దానికేదో జవాబు వచ్చింది.

అడ్రెస్ చూస్తే వెంకటరావు కెరాఫ్ చలమయ్య అని వుంది.

అర్జీ ఆ అడ్రెస్ నేను రాసిందే అనుకుంటాను.

*



**వరదలు**

"ఈ ఎండాకాలంలో వరదల బాధేంటి పిన్నీ!"

"ప్రభుత్వం వారు కృత్రిమ వర్షాలు కురిపిస్తున్నారు కదా! వాటి ప్రభావం..."

— అడబాల సూర్యనారాయణ (విజయవాడ)



**సరదా**

చాల వరదా చిత్రాల్లో వరణ్ రాజ్ మళ్లీ నటిస్తున్నాడు. ఇందుక్కారణం వరణ్ రాజ్ నిర్మాత దర్శకులతో కలిసిపోవడం, రెమ్యూనిరేషన్, నటీనటుల కాంబినేషన్ విషయంలో పట్టింపులు లేకుండా వుండటం. ముఖ్యంగా తెలుగు చిత్రాల్లో స్థిరపడదామన్న ఆలోచన కలిగి వుండటం! అందుకే విలన్ వేషాలతోపాటు కేరక్టర్ ఆర్టిస్టు పాత్రలు, వరదాపాత్రలు వేసి నటుడిగా మళ్లీ విజృంభిస్తున్నాడు.

— సాయిరాం

